


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కావమ్మ చెప్తే కామోసు

**కావమ్మగారికి తింటే** ఆయాసం, తినకపోతే నీరసం. నాలుగు అడుగులేస్తే గుండె దడట. ఆవిడకి ఏ జబ్బూ లేకుండా మా కాలనీలో చూసినవాళ్ళెవరూ లేరు. అరుగు మీద కుర్చుని "ఎవరా వెళ్ళేదీ?" అని నీరసంగా, బలహీనమైన స్వరంతో జ్వరమొచ్చివణుకుతున్న పిచ్చుకలా అడుగుతుంది.

"నేనండి సుబ్బారావుని" అంటే

"ఒరే సుబ్బా జొరపడ్డారా. నాలుగు ఎండుద్రాక్షా, కాసిని ఆలుబకరా పళ్ళూ పట్టుకొస్తావేంటీ?" అని గొంతు పెంచి అడుగుతుంది.

"నేను పనిమీద వెళ్తున్నానండీ వీలు కాదు" అనగానే, జుణాయించి, ఘింకారం చేసే ఏనుగులా "మీ వంశంలో చెడబుట్టావు కదరా. మీ నాన్న అప్పారావు ఏది కావాలన్నా చేతిలో పని వదిలేసి తుర్రుమని వెళ్ళొచ్చి చేసేవాడు. మీ బాబాయ్ గోవిందరావూ అంతే. మీ నాన్న వేలు విడిచిన పిన్నమ్మ కొడుకు గోపాలం ఇలాగే నేను ʻతేనుʼ అన్నాడు. వీధిలోకెళ్ళి బస్సు కిందపడి, కాలు విరగ్గొట్టుకున్నాడు" ఇలా శాపనార్థాలు పెట్టేది.

ఓనాడు "రిక్షాలో కాస్త బాబ్జీ డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళవే" అంది నన్ను. నేనింకా పదో తరగతి రాసిన శెలవల్లో గచ్చకాయలు ఆడ్తున్నాను. పోనీలే పెద్దావిడని "పద మామ్మా" అన్నాను.

ఈవిడ రిక్షా దిగగానే, కాంపౌండర్ వెంకటాద్రి "చచ్చాం" అనడం నాకు వినిపించింది.

ఈవిడ అతను తలవంచుకుని బిజీగా ఏదో మిక్స్చర్ కలుపుతుంటే "వెంకటా...పోయినసారిచ్చిన మిక్స్చర్లో ఏం కలిపావురా? ఒకటే ఘాటు. ఎండు మిరపకాయలు కానీ కలిపావేవిటీ?" అని దగ్గుతూ వెళ్ళి "ఆ రిక్షావాడికి రూపాయి పావలా ఇచ్చేసెయ్యి. నేను డాక్టారుకి ఫీజులో కలిపి ఇచ్చేస్తాను" అని కూర్చుంది.

"అదేవిటి పెద్దమ్మగారూ మీ రిక్షా చార్జీలు మీరే ఇచ్చుకోవాలి" అంటే.

"ఇదిగో వెంకటాద్రీ.. ఇట్టాగే అన్నాడు పాపాయమ్మగారి తమ్ముడు రామసూరి నెల తిరక్కుండా ఠక్కున గుండెపోటొచ్చి..." అనగానే

"రూపాయి పావలా కోసం నా మాసికం పెట్టకండి. కానీ ఫీజులో ఇచ్చేయండి" అని వెంకటాద్రి రిక్షా అతనికి డబ్బులిచ్చి పంపిస్తుంటే.

"ఆ పిప్పళ్ళ బస్తాలాంటి అమ్మగారిని లాగలేక చచ్చా సామీ. ఇంకో పావలా ఇప్పించండి" అని రిక్షా అబ్బి రూపాయిన్నర పుచ్చుకున్నాడు.

అక్కడ కూర్చున్న పేషెంట్స్‌ని చూసి "కుర్రపిల్లలు మీరు ఆనక చూపించుకుందురు గాని నన్ను పోనివ్వండే ముందు. ముసలిదాన్ని టపీమంటే ఆ పాపం మీకు తగిలేను" అని, వాళ్ళకన్నా గబగబా నా చెయ్యి పట్టుకుని లాక్కెళ్తూ లోపలికి తీసుకెళ్ళింది. బాబ్జీ డాక్టర్‌గారు 'డాక్టర్‌బాబు'లో శోభన్‌బాబులా చాలా స్టైలుగా నాజూగ్గా వుండేవారు.

ఈవిడ్ని చూడగానే "మళ్ళీ ఏమైందీ?" అన్నారు.

"బాబూ నువ్వూ మా మనవడు అప్పిగాడూ వేరు కాదు నాకు. పోయిన వారం కాళ్ళు తోడేస్తున్నాయి అంటే నువ్విచ్చిన మాత్ర చాలా పవర్ వుంది. అందుకే అరముక్కే వాడి అరముక్క ఆర్సనేనియం వేసుకున్నా. తల నెప్పికి నువ్వేదో రాసావు కానీ సర్పాసిల్ రాయి. అదీ మరీ పొటెన్సీ ఎక్కువ కాకుండా, సగం చాలు. నెబిఫిలా.. నెబుస్టారా.. అదొద్దు నాయినా బీ.పికి. ఆమేలినీయం అనే టాబ్లెట్ మా తోడికోడలి అక్క భువనేశ్వర్‌లో వాడుతోందిట. అప్పటినుండీ గుండెదడ తగ్గి, సినిమా థియేటర్‌కి నడుచుకుంటూ వెళ్ళిపోతోందిట. అది రాయి" అని ఈవిడ చెప్తుంటే.

బాబ్జీ డాక్టర్ "ఇంతకీ మీకు బి.పినా? కాళ్ళు నెప్పులా? తల నెప్పా? గుండె నెప్పా?" అని చిరాకుని చిరునవ్వులో రంగరించి, శోభన్‌బాబు క్రాఫ్ ఓసారి సవరించుకుని కళ్ళతోటే నన్ను పలకరిస్తూ అడిగాడు.

"అవేమీకావు నాయినా ఉదయం ఓ ఇడ్డెన్ ముక్క పంచదార అద్దుకుని తిన్నానా.. అరిగినట్టు లేదు" అంది.

"ఓ ఇడ్డెన్ ముక్కకే!?" అన్నాడాయన.

"ఇంకో ఇడ్డెన్ పుట్నాల పప్పు పచ్చడి అద్దుకునీ, ఇంకో రెండు కారంపొడితో, మరో రెండు రాత్రి మిగిలిన చారులో వేసుకుని, మింగాను నాయినా. అవి అరగలేదు. పట్టుమని పది ఇడ్లీలు తినలేకపోతున్నాను. కడుపులో ఉబ్బరం... విరేచనాలూ" అంది.

"పది ఇడ్లీలే" అన్నాడాయన.

"ఇది వరకు ఇరవై నాయినా. ఇరవై ఇడ్డెన్లున్న వాయి నా ఒక్కదానికే వేసేది మా కోడలు" అందీవిడ.

"ఈ వయసులో అంత తింటే అరగదండీ మరీ" అని బాబ్జీ డాక్టర్‌గారు ఓ కాయితం పర్‌ర్‌మని చింపి, ప్రిస్క్రిప్షన్ రాస్తూ" ఈ అమ్మాయి మీ మనవరాలా?" అన్నాడు.

"మా మనవరాలు పచ్చని పసిమి. ఇలా ఎందుకుంటుందీ? ఇది పక్క వీధిలో రవణమ్మ మనవరాలు. ఏమీ తోచక గచ్చకాయలు ఆడ్తుంటే, నాతో తీసుకొచ్చా తోడు ఉంటుందని" అందావిడ.

నాకు నసాళానికి అంటింది. నా రంగుని పరిహసించింది, శోభన్‌బాబులాంటి డాక్టర్ ముందు. పైగా నేను ఖాళీగా గచ్చకాయలు ఆడుకోక, పిల్లలకి అన్నం వండిపెట్టుకునే వయసా? నేనేదో వెంటపడి వచ్చినట్లు చెప్తోంది.

ఆయన నవ్వి మందులు రాస్తుంటే "ఆగు నాయినా ఆగు. ఆ కోడిగీతలేంటీ? చక్కగా తెలుగులో అర్థమయ్యేట్టు రాయలేవూ?" అంది.

"మీకెందుకండీ అర్థం అవడం? ఆ మెడికల్ షాపు గుర్నాధానికి అర్థమౌతుంది" అన్నాడాయన కాస్త చిరాగ్గా.

"గుర్నాధానికి తెలుగు ఎంచక్కా వచ్చు. తెలుగులో రాయి బాబూ. నువ్వు ఆంజనేయస్వామి తోకంతా లిస్ట్ రాస్తే అందులో సగం నాకు పనికిరానివీ, నీకూ, గుర్నాధానికీ పనికొచ్చేవీ ఉంటాయి. ఏదీ పైకి చదువు వింటా" అంది.

ఆయన కోపం వచ్చినా మర్యాదగానే "స్పోరో లేక్, లోపర్ మిడే ఇవి బాగా మోషన్స్ అయితే రోజుకి రెండుసార్లు" అంటుంటే "అయ్యో అవి నాకు పనిచెయ్యవు నాయినా ఈ మధ్య మా బావగారి చెల్లెలుకి క్విన్సికోడా ఏదో మంచి మందు ఇచ్చారట. అదీ రోజుకి ఇరవైసార్లు ప్రదక్షిణాలు చేసేదిట. ఈ టాబ్లెట్‌కి ఇక టక్కున కట్టేసాయిట. ఇంక కాళ్ళ నెప్పులకి ఏం రాసావు నాయినా?"

"బ్రూఫిన్ ఒకటి మధ్యాహ్నం అన్నం తిన్నాక"

"అది వద్దు డోలో చాలు. వేసుకుంటే హాయిగా ఉంటుంది. ఇవన్నికాదు నాయినా ఈ వయసులో బుర్రున నిద్రపట్టడానికి వేలియం రాయాలి. రాత్రిళ్ళు మరిచిపోతే నిద్రలేపి మరీ ఇస్తుంది మా కోడలు. అవో 30 రాసి పుణ్యం కట్టుకో"

"అవి అలా ఇవ్వకూడదండీ. నిద్రమాత్రలు పొరపాటున ఎక్కువ వేసుకుంటే ప్రమాదం" అన్నాడు బాబ్జీ డాక్టర్. "నాలుగు రాస్తాను" అన్నాడాయన.

"బాబూ నాకు యాభై ఏళ్ళ అనుభవం. నువ్వేమో ప్రాక్టీసు పెట్టి పట్టుమని పదినాళ్ళు అవలేదు. నాకన్నా నీకు ఎక్కువ తెలుసా అంట ? చెప్పు."

"మరి మీరు నా దగ్గరకి ఎందుకొచ్చారండీ?"

"శంఖంలో పోస్తే కానీ తీర్థంకాదని, నేను ఇవన్నీ ఇమ్మంటే ఆ మెడికల్ షాప్ వాడు ఇచ్చి చావడు. నీ చేత రాయిస్తే, నీకూ పదిరూపాయలు వస్తాయి, నాకూ పని అవుతుంది అని వచ్చాను" అంది.

"అంటే డాక్టర్‌గారికన్నా నీకు ఎక్కువ తెలుసా మామ్మా?" నేను ఆయన తరఫున వకాల్తా పుచ్చుకుని అడిగాను.

"ఇసేవ్ నీ కెంత నోరే. పోనీ అని గాలికి తిరుగుతుంటే రిక్షా ఎక్కించి తీసుకోస్తేనూ" అంది.

"పోనీలే ముసలావిడ అడిగిందని నేను నవలలు చదువుకోవడం ఆపేసి వస్తే నన్నేదో ఉద్ధరించినట్లు మాట్లాడ్తావేంటీ? అసలు రోగం వచ్చినదానివి, అంతంత చదువుకున్న శోభన్‌బాబులాంటి డాక్టర్ బాబుని, కూరలో కరివేపాకులా తీసిపారేసి, నీ మందులు నువ్వే చెప్పుకుంటావా? నీ మాసికానికి నువ్వే వంటలు ఎన్నుకున్నట్లు.. నీకేం తెలుసనీ? తోడికోడలు చెల్లెలూ, బావగారి వియ్యపురాలూ నీకేవైనా అయితే వచ్చి నయం చేస్తారా? పదోనాడొచ్చి, పదకొండూ, పన్నెండూ కూడా కుంభం లాగిస్తారు అంతే" అని గడగడా వాయించేసాను.

"ఓసినీ జిమ్మడా! ఎన్నెన్ని మాటలనేసావే. పెద్దదాన్ని అనైనా చూడకుండా. డాక్టర్ బాబూ నాకేవి పడ్తాయో అవి చెప్పడం తప్పా?" అందావిడ నోరంతా తెరిచి.

"తప్పేనండీ. దీనివల్ల మీకే ప్రమాదం, నాకెందుకొచ్చిందీవిడతో, టైం వేస్ట్ అని నేను మీరు చెప్పినవల్లా రాస్తే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చి కాలో చెయ్యో పడిపోతే మీ గతేవిటి చెప్పండి? మీకీ మందుల పరిజ్ఞానం ఇస్తున్న బంధువులు వచ్చి చేస్తారా? చిన్న పిల్ల అయినా ఆ అమ్మాయి చక్కగా చెప్పింది" అన్నారు బాబ్జీ డాక్టర్.

కావమ్మగారు మా ఇద్దర్నీ తిట్టుకుంటూ మనసులో "సరే ఆ కాయితం ఇటివ్వు బాబూ. వంద కాయితం చిల్లరలేదన్నాడు మా అబ్బాయి శంకరం. ఆనక సాయంత్రం ఫీజు వాడొచ్చి ఇస్తాడు. నువ్వెళ్ళవే. నేను మా నేస్తం కాంతం దగ్గరకి వెళ్ళి చూసొస్తా" అని నా రిక్షా సవారీ కాన్సిల్ చేసి, నడిచిపోమ్మంది.

నేను బతుకు జీవుడా అని "వస్తా డాక్టర్‌గారూ" అని నమస్కారం పెడితే..

ఆయన "డాక్టర్ దగ్గరకి వస్తా అనకూడదు" అని నవ్వారు.

నేనూ నవ్వుకుంటూ తూనీగలా రివ్వున బయటకి పరుగు తీసాను.

ఆ తర్వాత నేను పెరుగుతున్న కొద్దీ ఇలాంటి కావమ్మగార్లని చాలామందిని చూస్తూ వచ్చాను. మా మిత్రుడి భార్య ఒకరు డాక్టర్ దగ్గరకి ఆయనతో కూడా వెళ్ళి, ఆయన రోగం ఆయనని చెప్పనివ్వదు ఈవిడ ఆయన వ్యాధి లక్షణాలు ఏకరువు పెడ్తుంది.

"డాక్టర్ గారు నాకు కడుపులో బిగదీసినట్లుగా వుంటోంది" అని ఆయన అనగానే, "కాదండీ పొత్తికడుపులో బిగపడ్తోంది. బొడ్డు కిందన ఒక ఇంచ్ కిందుగా" అంటుంది.


"తలమీద సుత్తి పెట్టి కొట్టినట్లుగా వుంటోంది" అని ఈయన అంటే "కాదు డాక్టర్‌గారూ చెవుల్లో ఈయనకి డ్రమ్స్ వాయించినట్లు అవుతోంది" అంటుంది.

"సరే.. దీనికి ఎజిత్రోమైసిన్‌తోబాటుగా టాక్సిడో.. అనీ" అని డాక్టర్ చెప్పబోతుంటే "ఒద్దు. ఏంటీ బయోటిక్స్ పడవు. టక్సిడో కన్నా నైస్ అయితే అన్నంకూడా అరుగుతుందేమో. హేపీ అయితే అన్నీ కుదుర్తాయికదా! ఒకవేళ ఇవి రాసిన హాఫ్ హాఫ్ రెండు పూట్లా రాయండి. ఫుల్ వద్దు" అంటుంది.

అసలు మొగుడికి తలలో డ్రమ్స్ వాయించినట్టు అవుతుందో, మద్దెల వాయించినట్టు అవుతుందో ఎంత అర్ధాంగి అయినా ఈవిడకి తెలుస్తుందా? ఆయనకి ఏ నరం అయినా ఈవిడ చెప్పినచోట కాకుండా వేరే చోట నెప్పి రాకూడదా? మరీ ఇంత డిక్టేటర్ షిప్పా?

ఇట్లాంటి కావమ్మలూ, కావయ్యలూ ఇంటింటా వుంటారేమో? డాక్టర్ దగ్గరకి వెళ్ళినప్పుడు ఆయన చదువుకి విలువిచ్చి, మెడికల్ షాప్ అతనికి డబ్బిచ్చి మీ రోగానికి మందిచ్చి, అతి తెలివికి రెస్ట్ ఇస్తే గట్టెక్కుతారు లేదా కాలవలో బుడుంగున మునిగినట్టు మునుగుతారు.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4